

కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏసీసీ, ఆగస్టు 9: జిల్లాలోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అధారిటీ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డిస్టిక్ సెషన్స్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అధారిటీ చైర్మన్ బోయ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫీస్ అసిస్టెంట్ కమ్ క్లర్కు, రిసెప్షనిస్టు కమ్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ ప్యూన్ మున్షి అటెండెంట్ ఒక్కో పోస్టుకు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను 24వ తేదీలోగా పంపాలని తెలిపారు. వివరాలకు హెచ్‌టీ పీపీఎస్//డిస్ట్రిక్స్.ఈకోర్ట్సుజీవో.ఇన్/మంచిర్యాల వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

ఆమోదయోగ్యంగా ఉంటాయా..?



- ఎల్ఆర్ఎస్ చార్జీలపై ఉత్కంఠ
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపులు
- సామాన్యులకు భారంగా మారిన నూతన చట్టం
- రెండింతలు పెరిగిన క్రమబద్ధీకరణ చార్జీలు
- సరవణ చేయాలంటూ ప్రభుత్వానికి వేడుకోలు

మంచిర్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): భూములను క్రమబద్ధీకరించేందుకు లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి తేవడంతో ప్రజల దృష్టంతా విధివిధానాలపైనే కేంద్రీకృతమై ఉంది. 2020 సెప్టెంబరులో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టం ప్రజలకు భారంగా మారనుంది. ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రభుత్వం తమ నెత్తిన అధనపు మోయ లేని భారం మోపిందని సామాన్య ప్రజలు లబో దిబోమంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అక్రమ లే అవుట్లు, రిజిస్ట్రేషన్లు లేని ప్లాట్లను క్రమబద్ధీకరిం చేందుకు 2020 సెప్టెంబన 1న జీవో విడుదల చేసింది. ఇందులో భాగంగా 26 ఆగస్టు 2020 లోపు సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన లే అవుట్ యజమానులు, ప్లాటు ఓనర్లకు ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించినట్లు ప్రకటించింది.

ఇందులో భాగంగా విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎప్పుడో 20 ఏళ్ల క్రితం ఇల్లు నిర్మించు కొని, విద్యుత్, మంచినీటి కనెక్షన్లు కలిగి ఉండి, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, మున్సి పాలిటీల నుంచి ఇంటి నంబర్లు పొంది, ఇంటి పన్నులు చెల్లించి, పలుమార్లు క్రయ విక్రయాలు జరిపి ప్రొసీడింగులు పొందిన స్థిరాస్తులకు సైతం ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ అమలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. లేని పక్షంలో అవసరం మీద వాటికి క్రయ విక్రయాలు జరిపే అవకాశం ఉండదు. ఇలా భూముల రిజిస్ట్రేషన్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరుతో లంకె పెట్టడంతో సామాన్య ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కాగా తాజా ప్రభుత్వ నిర్ణయం మేరకు ఎల్ఆర్ఎస్ కొత్తగా లే అవుట్ లేని వెంచర్లలోని ప్లాట్లకే ఎల్ఆర్ఎస్ వర్తింప జేస్తారా...లేదా అన్ని ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలనే నిబంధన విధిస్తారా అన్న అంశం ప్రస్తుతం తీవ్రంగా చర్చనీయాంశం అవుతోంది.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం..

భూముల క్రమబద్ధీకరణ పేరుతో అప్పటి ప్రభుత్వం ప్రజలపై అధిక భారమే మోపేందుకు సిద్ధపడింది. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం అప్పటికే రిజిస్ట్రేషన్లు కలిగి ఉన్న భూములకు రెండింతలు చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు 200 చదరపు గజాల ప్లాటు 168 చదరపు మీటర్లకు సమానం. ప్రభు త్వం నిర్ణయించిన చార్జీల ప్రకారం 168 చదరపు మీటర్లకు రూ. 400 చొప్పున లెక్కిస్తే రూ. 67,200 చార్జీ అవుతోంది. 3,000 చదరపు గజాల లోపు భూమికి 25 శాతం క్రమబద్ధీకరణ చార్జీలు వసూలు చేస్తుండగా పై ప్లాటుకు (168, 400) రూ. 16,800 ఎల్ఆర్ఎస్ చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. సదరు స్థలం నాన్ లే అవుట్ గనుక పార్కు స్థలం కింద చూపనందున అదనంగా ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్ చార్జీల కింద ప్లాటు మార్కెటు విలువపై మరో 14 శాతం పన్ను విధిస్తారు. ఈ లెక్కన మార్కెట్ విలువ రూ. 1.200 ఉన్న చోట 168 చదరపు గజాల స్థలానికి రూ. 2 లక్షల 1600 ధర పలుకుతుంది. ఇందులో 14 శాతం పన్ను కింద రూ. 28, 224 వసూలు చేస్తారు. ఇలా ప్లాటు క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ కింద రూ. 16,800తోపాటు ఓపెన్ స్పేస్ కంట్రి బ్యూషన్ చార్జీల కింద రూ. 28,224 చెల్లించాలి. అంటే ప్లాటు క్రమబద్ధీకరణ అయ్యేసరికి రెండు కలిపి రూ. 45,024 చెల్లించాల్సి ఉంటుంది. ఇలా దశాబ్దాల కాలం నాటి ప్లాట్లకు సైతం ఎల్ఆర్ ఎస్ చెల్లించాలని ప్రభుత్వం చట్టం తెచ్చింది.

చట్టం తెచ్చిన చిక్కులు..

భూముల క్రమబద్ధీకరణకు గాను చట్టంలో అనేక చిక్కులు ఉన్నాయి. లే అవుట్ లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఆ చట్టం ప్రకారం తిప్పలు తప్పవు. అనధికార వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాటును ఆనుకొని ఉన్న రోడ్డు కనీసం 30 ఫీట్ల వెడల్పు ఉండాలి. రోడ్డు తక్కువగా ఉన్న పక్షంలో సదరు ప్లాటు నుంచే రోడ్డుకు సరిపడా స్థలం మినహాయించి, మిగిలిన భూమికే ఎల్ఆర్ఎస్ వర్తింపజేస్తారు. అంటే రోడ్డుకు పోను మిగిలిన స్థలం మాత్రమే భూమి యజమానికి దక్కుతుందన్న మాట. కాయ కష్టం చేసి, కూడబెట్టుకున్న డబ్బులతో కొనుగోలు చేసిన ప్లాట్లు కూడా పూర్తిస్థాయిలో దక్కే అవకాశం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల తప్పిదం కారణంగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అదనపు ఖర్చులు భరించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పెండింగులో వీఎల్టీ దరఖాస్తులు..

గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ప్రకటించక ముందు ఖాళీ స్థలాలకు టాక్సులు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్లు చేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మున్సిపల్ పరిపాలన శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయాలంటే వేకెట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్టీ) చెల్లించి అసస్మెంట్ సర్టిఫికెట్ పొంది ఉం డాలన్న నిబంధన విధించారు. దీంతో లే అవుట్ లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వీఎల్టీకు పెద్ద మొత్తంలో దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో వ్యక్తి తన ప్లాటుకు సంబంధించి కనీసం రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు టాక్సు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఒక్క మంచిర్యాల మున్సిపాలిటీలోనే 600 వీఎల్టీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ అంశం తెరపైకి వచ్చినం దున వీఎల్టీ అసస్మెంట్ దరఖాస్తుల పరిస్థితి ఏంటో అర్థంగాక ప్రజలు తలలు పట్టుకొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు సిద్ధపడుతున్నందున భూముల క్రమబద్ధీకరణ చార్జీలు సామాన్య ప్రజలై భారం పడకుండా ఆమోదయోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదివాసీ సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి


తాళ్ళపేటలో కుమరం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న తిరుపతి

దండేపల్లి, ఆగస్టు 9: ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కట్నాక తిరుపతి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలో పలు గిరిజన గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు శుక్రవారం దండేపల్లికి తరలివచ్చారు. ముందుగా తాళ్ళపేటలో కుమరం భీం విగ్రహం వద్ద పూజలు చేసి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. అక్కడ నుంచి దండేపల్లి వరకు చైర్మన్ తిరుపతితో పాటు ఆదివాసీ గిరిజనులు బైక్ ర్యాలీ చేపట్టారు. దండేపల్లిలో గిరిజన సంప్రదాయబద్ధంగా డోలు వాయ్యిదాలతో బస్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహిం చారు. గాంధీ, తెలంగాణ తల్లి, జయశంకర్, అంబేద్కర్, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంగడి బజారు లో ఆదివాసీ గిరిజన జెండను ఎగురవేశారు. పద్మశాలి సంఘం భవ నంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతి మాట్లాడారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు రాముపటేల్, శ్రీనివాస్, సోమ, భూమేష్, కిషన్, జంగు, సూరు, జలపతి, లచ్చు, కాంతరావు, లింగా రావు, చిన్నయ్య, అర్జున్, ఎల్లయ్య, చందు, రాజేష్, శంకర్, రమేష్, చంద్రయ్య, రాజయ్య, సత్తయ్య, అనంత్, భీం, రాజయ్య, గిరిజన గ్రామాల పటేల్, నాయకులు పాల్గొన్నారు.

ఏసీసీ: జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, డీటీడీవో మడావి గంగారాంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాకారులతో కలిసి సంప్రదాయ వాయిద్యాలతో ఆట పాటలతో వైశ్య భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఆదివాసీ సంఘాల నాయకులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో 9 ఆదివాసీ తెగల నాయకులు, విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం కార్య నిర్వహక కమిటీ ఆధ్వర్యంలో పలు అంశాలపై తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. మంచిర్యాల జిల్లాలో గురు కుల గిరిజన బాలికల , బాలుర కళాశాల మంజూరు చేయాలని , ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాల ని, జీవో నంబరు 3 అమలు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యనిర్వహక కమిటీ అధ్యక్షుడు కుర్సింగె వెంకటేశం, పెందోర్ హన్మంతు, మడావి శంకర్, గుర్రాల రాజవేణు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని రొట్టెపల్లి, సాలెగూడెం, దేవాపూర్, కొండాపూర్, కాసిపేటలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఆదివాసీ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మడావి వెంకటేష్ మాట్లాడుతూ అక్రమంగా ఎస్టీ జాబితాలో చొరబడిన వలస లంబా డీలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముందు ఆదివాసీ సంప్ర దాయాలతో భారీ ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం కుమరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయ కులు మడావి గంగారాం, పెంద్రం శంకర్, సిడాం గణపతి, పెంద్రం ప్రభాకర్, సంద్ర భూమన్న, ఆత్రం జంగు, రాధ, ఆడె జంగు పాల్గొన్నారు.


చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

బెల్లంపల్లి (తాండూర్): తాండూర్ మండలంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీలు, మన్నెవార్ కొలావార్‌లు ర్యాలీగా వచ్చి ఐబీ చౌరస్తాలో డప్పు వాయిద్యాలతో మండల నాయకులతో కలిసి నృత్యాలు చేశారు. జెండాను ఎగురవేశారు.

చెన్నూరు: పట్టణంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కోటపల్లి బస్టాప్ నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ చౌక్, పాత బస్టాండ్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు కొనసాగింది. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హబీబ్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన ఆదివాసీ వేడుకల్లో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నూరు, కోటపల్లి మండలాలకు చెందిన ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

భీమారం: ముండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ జెండాను విష్కరించారు. అనంతరం ఆదివాసీల ఆరాధ్య దైవం లక్ష్మీదేవి వేషా ధారణలో డప్పుచప్పుళ్లతో ఆవడం క్రాస్ రోడ్డు మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ తైనేని రవి, నాయకులు రొడ్డ శ్రీనివాస్, మహేష్, కృష్ణ మూర్తి, కుమార్, తిరుపతి, సురేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

జన్నారం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కొత్తపేట, తిమ్మాపూర్, లోత్‌రై గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఆదివాసీ నాయకులు రాజేష్, రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ ఆలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు, ఆదివాసీలు మోహన్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణకు బాధ్యతగా పాటుపడాలి
- కలెక్టర్ కుమార్ దీపక్


రాపెల్లిలో మొక్కలు నాటుతున్న అధికారులు

హాజీపూర్, ఆగస్టు 9: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ , రాష్ట్ర ప్రత్యేకాధికారి ఇలంబర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని రాపెల్లి, గుడిపేట, హాజీపూర్ గ్రామాల్లో వన మమహోత్సవం, స్వచ్ఛదనం పచ్చదనంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్ డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: విద్యార్థులే దేశ ప్రగతికి మూల స్తంభాలని , సమాజంతో పాటు తల్లిదండ్రులు గర్వించే విధంగా మంచి ఫలితాలు సాధిస్తూ పాఠశాలలకు పేరు తీసుకు రావాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వా మి అన్నారు. పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరయ్యారు. మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. కార్యక్ర మంలో మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ భాగ్యల క్ష్మీ, మాజీ ఎమ్మెల్యే ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఆదర్శ పాఠశాల, సండ్రోన్‌పల్లి రైతు వేదిక వద్ద ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మొక్కలు నాటారు. కార్యక్ర మంలో మాజీ జడ్పీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఒడ్నాల కొమురయ్య, గందె రాంచదంర్, బండి సదానందం యాదవ్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బాలికల ఉన్నత పాఠ శాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చైర్‌ప ర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు రవి, రాజలింగు, శ్రీలత, ఆర్‌ఐ ప్రవీణ్, టీపీవో చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సంతోష్, టీఎంసీ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలో అధికారులు పాఠశాల విద్యార్థు లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను ప్రజలకు వివరించారు.

జైపూర్: మొక్కలు నాటి సంరక్షించాలని ఏపీఎం రాజ్‌కుమార్ అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో కలిసి మొక్కలు నాటారు.

కోటపల్లి: గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మోడల్ స్కూ ల్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

బెల్లంపల్లి(తాండూర్): స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా తాండూర్‌లో డీఆర్‌డీవో కిషన్ పాల్గొని మొక్కలు నాటారు. కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొల గించారు.

వేమనపల్లి: మండలంలోని రాజారం, నాగారం గ్రామాల్లో ప్రత్యేకాధికారి సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. రాజారంలో ప్రత్యేకాధికారి రమేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

జన్నారం: ఇందన్‌పల్లి, రాయికుంట, కొత్తపేట , జన్నారం , పొనకల్‌లో ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో సుష్మారావు తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిలో మొక్కలు నాటుతున్న వివేక్‌వెంకటస్వామి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాలు కల్పిస్తున్నాం

జైపూర్, ఆగస్టు 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజల సౌకర్యం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. కుందారంలో రూ. 1.50 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుందారం గ్రామంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో గ్రామస్థుల కోరిక మేరకు విశాఖ చారిటబుల్ ట్రస్టు తరుపున నాలుగు బోర్‌వెల్స్ వేయించానన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత లేకుండా నియమిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు వైద్యం సకాలంలో అందించాలని, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, మండల నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంభర్‌రెడ్డి, ఫయాజ్, జక్కుల వెంకటేశం, వైద్యులు అనిల్‌రావు, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటాం

చెన్నూరు, ఆగస్టు 9 : అన్ని వర్గాల ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రీలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ. 1.50 లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందని దీంతో 60 శాతం మంది రైతులకు లబ్ది చేకూరిందన్నారు. ఆగస్టు 15లోపు రూ. 2 లక్షల వరకు అందరికి రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీ రాని వారు తనకు లిస్టు ఇవ్వాలని కోరారు. ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పట్టణంలోనిమైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలన్నారు. ఆయన వెంట నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేతకానీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

జన్నారం, ఆగస్టు 9: నేతకానీలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ నేతకాని సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బోర్లకుంట ప్రభుదాస్, జాడి గంగాధర్, శంకర్, లక్ష్మణ్, మల్లేష్, నందయ్య, స్వామి, మాణిక్యం పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

జైపూర్, ఆగస్టు 9: మండలంలోని శెట్‌పల్లి గ్రామానికి చెందిన రేవెల్లి శ్రీకాంత్(33) హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ నెల 6న టేకుమట్ల గ్రామంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహ నంపై వెళ్తున్న శ్రీకాంత్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. శ్రీకాంత్‌ను మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా

నస్పూర్, ఆగస్టు 9: అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్‌కు అందజేశారు. ఆందోళనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అబ్బోజు రమణ, ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య



తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకటరెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.



అనిరుథ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతోపాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికే 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

● సంక్షిప్తం..

'స్వచ్ఛదనం పచ్చదనం' నిర్వహణ అభినందనీయం

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 9: ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహణ మంచిర్యాల జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని స్వచ్ఛదనం పచ్చదనం మంచిర్యాల,కుదంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, పరిస రాలను పరిశుభ్రం చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, జడ్పీసీఈవో గణపతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా దాగం మల్లేష్

కాసిపేట, ఆగస్టు 9: సీపీఐ మండల కార్యదర్శిగా కాసిపేటకు చెందిన దాగం మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శుక్రవారం సమా వేశం నిర్వహించారు. దాగం మల్లేష్‌కు జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం కమిటీని ప్రకటించారు. మండల కార్యదర్శిగా దాగం మల్లేష్, సహాయ కార్యదర్శు లుగా గట్టు సర్వేశం, జాడి పోశం, కోశాధికారిగా పులి శంకర్‌లను ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు.

సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్ నాయక్

నెన్నెల, ఆగస్టు 9: సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడిగా నెన్నెల మండ లం కొత్తూరు గ్రామానికి చెందిన గుగ్లోత్ మల్లేష్ నాయక్ నియామకం అయ్యారు. హైదరాబాదులో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో సేవావాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు నాయక్, వ్యవస్థాపకులు, ప్రణాళిక కమిటీ చైర్మన్ ధారవత్ ప్రేమ్‌చంద్ నాయక్ నియామక పత్రాన్ని అందుకున్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

కోటపల్లి, ఆగస్టు 9: బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పెద్దింటి పున్నంచం ద్ అధ్యక్షతన శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్స వం గురించి వివరించడంతో పాటు జాతీయజెండాలతో మండల కేంద్రాల్లో ర్యాలీ తీయాలని తీర్మానించారు. . కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు కందుల వెంకటేష్, పెద్దింటి లక్ష్మణ్, వేల్పుల రాజేష్, సోషల్ మీడియా అధ్యక్షుడు దుర్గం నర్సింహులు రైతు మోర్చా అధ్యక్షుడు రాళ్లబండి శ్యాంసుందర్, కార్యదర్శులు కొండగొర్ల జయకర్, తిరుపతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన స్పెషల్ ఆఫీసర్

భీమారం, ఆగస్టు 9: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠ శాలను మండల స్పెషల్ ఆఫీసర్ కల్ప న శుక్రవారం సందర్శించారు. వంటగది, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన వ్యాపారి అరెస్టు

కోటపల్లి, ఆగస్టు 9 : రైతుల వద్ద నుంచి మిర్చీ కొనుగోలు చేసి వారికి డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన వ్యాపారి దేవులపల్లి రమేష్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. మండలంలోని జనగామ, కొల్లూరు, రాంపూర్ గ్రామాలకు చెందిన మిర్చీరైతులను ఏటూరునాగారంకు చెందిన దేవులపల్లి రమేష్ అనే వ్యక్తి మోసం చేశాడని తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన 21 మంది రైతుల నుంచి రూ. 47 లక్షల మిర్చి కొనుగోలు చేసి ముందుగా కొంత డబ్బులు చెల్లించి రైతులను నమ్మబలికి ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తూ రైతులను ఇబ్బంది పెట్టారన్నారు. రాంపూర్‌కు చెందిన కవ్వాల శ్రీనివాస్ ,హన్మంతు, బొడ్డు సంపత్ అనే రైతులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

జన్నారం, ఆగస్టు 9: మండలంలోని ధర్మారం గ్రామం రూప్‌నాయక్ తండాకు చెందిన భుక్య సక్కులాల్(60) శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు జన్నారం పోలీసులు తెలిపారు. ఇంటి వెనకాల బావికి గల కరెంటు మోటారుకు వర్షం నీరు పడకుండా ఉండడానికి టైరు ట్యూబ్ కప్పడానికి సక్కులాల్ వెళ్లాడు. ట్యూబ్ కప్పుతుండగా మోటారుకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 9: జిల్లాలో నాగుల పంచమిని శుక్రవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో నాగుల పంచమిని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఉదయం నుండే నాగ దేవత ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. హమాలీవాడ కట్ట పోచమ్మ ఆలయం సమీపంలో గల నాగ దేవత ఆలయం వద్దకు భక్తులు పెద్దఎత్తున వచ్చి పూజలు చేశారు.

దండేపల్లి: మండల వ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో నాగుల పంచ మి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లోనూ భక్తుల సందడి నెలకొంది.

చెన్నూరు: పట్టణంలోని అంబా అగస్త్యేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలోని నాగదేవత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసిన మహిళలు పుట్టలో పాలు పోశారు.

జన్నారం: మండలంలో నాగుల చవితిని మహిళలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద గల పాము పుట్టల వద్దకు వెళ్లి పుట్టకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పుట్టలో పాలు పోశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.



చెన్నూరులో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

నకిలీ విలేకరి అరెస్టు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 9: విలేకరిని అని చెప్పుకుంటూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న గడ్డం రమేశ్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. శుక్రవారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల 24న నిందితుడు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్యకు ఫోన్ చేసి తనకు సంబంధించిన రహస్య సమాచారం తన దగ్గర ఉందని, తాను తన టీవీ చానల్‌లో ప్రచారం చేయిస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడని చెప్పారు. ఆ ప్రసారాన్ని నిలిపివేయాలంటే రూ.2వేలు పంపించాలని డిమాండ్ చేయగా సమ్మయ్య పంపించాడని సీఐ తెలిపారు. మళ్లీ 25వ తేదీన మళ్లీ ఫోన్ చేసి రూ.1000 ఫోన్ పే చేయించుకున్నాడని తెలిపారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా నిందితుడు విలేకరి కాదని తేలిందని, జైపూర్ పవర్‌ప్లాంట్‌లో లేబ ర్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. అతడిపై జైపూర్ పోలీస్ స్టేషన్‌లో 4 కేసులు ఉన్నాయని, గతంలో పీడీ యాక్టుపై జైలుకు కూడా వెళ్లివచ్చాడని తెలిపారు. రమేశ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ వెల్లడించారు.

జ్వరంతో గర్భిణి మృతి

కాసిపేట, ఆగస్టు 9: మండలంలోని రేగులగూడెంకు చెందిన గెడెం పార్వతి(22) అనే గర్భిణి (ఎనిమిది నెలలు) శుక్రవారం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పార్వతికి నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో మంచిర్యాలలోని మాతా శిశు కేంద్రం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మూడు రోజులు అక్కడి చికిత్స చేశారు. పరిస్థితి విషమించడంతో క రీంనగర్, వరంగల్ ఆసుపత్రులకు తీసుకువెళ్లాలని వైద్యు లు సూచించారు. గురువారం సాయంత్రం వరంగ ల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందు తూ శుక్రవారం ఉదయం మృతి చెందింది.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నెన్నెల, ఆగస్టు 9: మండలంలోని కుశ్నపల్లిలో గంగిరెడ్డి తిరుపతిరెడ్డికి చెందిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తిరుపతిరెడ్డి ఇంట్లో అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్టు తమకు అందిన పక్కా సమాచారంతో దాడి చేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు బాగు లేక.. ఆస్పత్రికి వెళ్లేందుకు అవస్థలు

- అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని ఎడ్ల బండిపై తరలిస్తుండగా మృతి

నెన్నెల, ఆగస్టు 9: పొలం పనులకు వెళ్లి అస్వస్థతకు గురైన గిరిజనుడు రోడ్డు బాగా లేక సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడ్డాడు. మండలంలోని కోనంపేటకు చెంది న జింజిరి జస్వంత్ (17) శుక్రవారం తల్లిదం డ్రులతో కలిసి పొలంపనులకు వెళ్లాడు. పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా బహిర్భూమికి వెళ్లి వస్తానని తల్లిదండ్రులకు చెప్పాడు. తల్లిదండ్రులు ఇంటికి వెళ్లిపోయారు. చాలా సమయం వరకు జశ్వంత్ ఇంటికి రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నాడు. వెంటనే 108కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. సీమరేగళ్ల వరకు వచ్చిన అంబులెన్స్ రోడ్డుపై మోకాలి లోతు బురద కారణంగా ముందుకు కదలలేక పోయింది. బురద వల్లా అంబులెన్స్ గ్రామానికి రావడం కుదరడం లేదని రోడ్డు బాగున్న వరకు యువకుడిని తీసుకురావాలని అంబులెన్స్ సిబ్బంది ఫోన్‌లో సూచించారు. ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న నెన్నెల పీహెచ్‌సీకి చేరితేనే జశ్వంత్‌కు వైద్యం అందుతుంది. చేసేది లేక జశ్వంత్‌ను ఎడ్లబండిలో వేసుకొని బయలుదేరారు. బురదరోడ్డు దాటి ఎడ్లబండిపై మూడు కిలోమీటర్ల దూరంలో నిలిచి ఉన్న అంబులెన్స్ వరకు అతి కష్టంమీద చేరుకున్నారు. అప్పటికే జశ్వంత్ మృతి చెందాడని అంబులెన్స్ సిబ్బంది చెప్పారు.



ఎడ్లబండిలో యువకుడిని తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు

ఎమ్మెల్యే వినోద్ పద్ధతులు మార్చుకోవాలి

-మావోయిస్టు నేత ప్రభాత్

మంచిర్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఎమ్మె ల్యే గడ్డం వినోద్ తన పద్ధతులు మార్చుకొని, ప్రజల సమస్యలు పట్టించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు. బెల్లంపల్లిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి ఆదేశంతో ఎన్నికల లబ్ధి కోసం ఎలాంటి విధివిధానాలు రూపొందించకుండా సింగరేణి క్వార్టర్లకు ఇచ్చిన పట్టాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడవలసి వస్తుందని తెలిపారు. పట్టాలు ఇచ్చే పేరుతో లక్షలాది రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేసి, ఇప్పటి వరకు ఇంటి నంబర్లు ఇవ్వకపో వడం వల్ల విద్యుత్ కనెక్షన్లు మంజూరు కావడం లేదని తెలిపారు. సింగరేణి మందమర్రి జనరల్ మేనేజర్ మనోహర్ కరెంట్ కట్ చేసే చర్యలకు పాల్పడడంతో బెల్లంపల్లి పట్టణంలోని వివిధ బస్తీలకు చెందిన కార్మికులు, రిటైర్డ్ కార్మికులు నాలుగు రోజులుగా అంధకారంలో మగ్గుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి, అప్పటి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అరాచకాలతో విసిగి వేసారిన ప్రజలు కాంగ్రెస్ నుంచి గడ్డం వినోద్‌ను గెలిపిస్తే సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు. వేమ నపల్లి మండల ప్రజలు వర్షాకు పొలాలు కొట్టుకుపోయి, ఇళ్లు కూలిపోయి ఇబ్బందులు ప డుతుంటే ఎమ్మెల్యే షికార్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోవాలని ప్రభాత్ హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 9: జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్‌లో గురువా రం అర్ధరాత్రి పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుం,ఇ రూ.6,500 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

సెక్యూరిటీ సిబ్బందిపై కార్మికుడి దాడి

శ్రీరాంపూర్, ఆగస్టు 9: శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పి 1 గేట్ వద్ద సెక్యూరి టీ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిపై ఓ కార్మికుడు దాడి చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సెక్యూరిటీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... ఎస్ అండ్ పిసి మహిళా గార్డు రాజనర్సమ్మ గురువారం ఉదయం విధుల్లో ఉన్నారు. అదే సమయంలో ఓ కార్మికుడు తన బ్యాగులో ఇనుప సామగ్రి తీసుకెళ్తూ ఆమె కంటపడ్డాడు. వెంటనే ఆమె అతడిని ఆపి ఇనుప సామగ్రి ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించింది., కోపోద్రిక్తుడైన సదరు కార్మికుడు తన వద్ద ఉన్న లైట్ బ్యాటరీతో సెక్యూరిటీ గార్డు తలపై కొట్టాడు. ఆమె గాయపడడంతో వెంటనే డిస్పెన్సరీకి తరలించారు. ప్రస్తుతం రాజనర్సమ్మ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 9: మండలంలోని రాజీవ్‌నగర్‌లో రాదండి లక్ష్మి ఇంట్లో శుక్రవారం ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. లక్ష్మి ఉదయం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి పోలీసులు , ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

నీలుగాయిని హతమార్చిన ఇద్దరి అరెస్టు


దండేపల్లి,ఆగస్టు 9: దండేపల్లి మండలం కర్ణపేటకు చెందిన ఇద్దరిని అటవీ జంతువు నీలుగాయిని హతమార్చిన కేసులో అరెస్ట్ చేసినట్లు తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మారావు తెలిపారు. మండలంలోని పాత మామి డిపల్లి గ్రామ సమీపంలో అడవి ప్రాంతంలో నీలుగాయిని హతమార్చి మాంసం విక్రయిస్తున్నరనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారని చెప్పారు. ఈ తనిఖీలో కర్ణపేట చెందిన మారినేని శామ్యూల్(రవి), మారినేని రాజన్న(రాజు) అనే ఇద్దరి ఇళ్లలో వన్యప్రాణి మాంసం లభ్యమైం దన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, ఇంకా ఎనిమిది మంది ఈ ఘటనలో భాగ్యస్వాములైనట్లు నిందితులు చెప్పారని ఎఫ్ఆర్‌వో సుష్మారావు తెలిపారు. ఇద్దరిని శుక్రవారం కోర్టులో హాజరు పరిచి సబ్‌జైల్‌కు తరలించినట్లు ఆమె తెలిపారు.

బదిలీపై వెళ్తున్న జీఎంకు సన్మానం

మందమర్రిటౌన్, ఆగస్టు 9 : మందమర్రి జీఎం మనోహర్ బదిలీ కాగా శుక్రవారం సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఏరియా అభివృద్ధికి జీఎం మనోహర్‌కృషి చేశారని కొనియాడారు. సింగరేణి ఏరియా ఆసుపత్రి ఏసీఎంవో ఉష కొత్తగూడెంకు బదిలీ కాగా ఆమెను అధికారులు ఘనంగా సన్మానించారు.

తహసీల్దార్‌గా సతీష్‌కుమార్

మందమర్రిరూరల్, ఆగస్టు 9: మందమర్రి మండల నూతన తహసీల్దార్‌గా సతీష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ చంద్రశేఖర్ బదిలీపై వెళ్తుండగా సన్మానించారు.



సంక్షిప్తం సమాచారం..

కెరమెరి: సరిహద్దుగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సైవిజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం అనార్‌పల్లి వాగుఅవతల పశువుల కాపర్లకు పులి కనిపించిందని సమాచారం అందుకున్న ఎస్సై, అటవీఅధికారులతో కలిసిగ్రామాలను సందర్శించారు.

ఆసిఫాబాద్ రూరల్: మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుదామని మాజీసర్పంచ్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని గుండి ప్రాథమిక పాఠశాలలోవారు ఉపాధ్యాయులతోకలిసి మొక్కలు నాటారు.

కాగజ్‌నగర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని ఎస్‌డీవో అప్పలకొండ అన్నారు. శుక్రవారం వనమహోత్సవంలో ఆయన మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వోదేవదాసు, సిబ్బందిపాల్గొన్నారు.

ఆసిఫాబాద్: లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని లేని పక్షంలో క్విట్‌ఇండియా ఉద్యమస్ఫూర్తితో పోరాటం చేస్తామని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారంపట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో కార్మిక,కర్షక, ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనవ్యక్తం చేశారు.

వాంకిడి: భారత యువజన కాంగ్రెస్ దినోత్సవాన్ని శుక్రవారం వాంకిడిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీఅధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు పతాకాన్ని ఆవిష్కరించారు.

పెంచికలపేట: తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్‌ఐగోపాల్ బదిలీపై వెళ్తుండడంతో తహసీల్దార్ వెంకటేశ్వరరావు స్థానికనాయకులతో కలిసి ఆయనను సన్మానించారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్‌గా విధులు నిర్వహిస్తూ పెంచికలపేట మండలానికి బదిలీపై వెళ్తున్న జుగాదిరావును శుక్రవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు.

బెజ్జూరు/కౌటాల: నెలవారి మరమ్మతులో భాగంగా శనివారం బెజ్జూరు33/11 విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో, కౌటాల మండలపరిధిలోని కౌటాల, గుండాయిపేట, గుడ్లబోరి, తాటిపల్లి, మొగడ్‌దగడ్, తుమ్మిడిహెట్టి, వీర్దండి, చింతలమానేపల్లి మండలంలోని రవీంద్రనగర్, బాబాపూర్, చింతలమానేపల్లి, బాబాసాగర్ గ్రామాల్లో మధ్యాహ్నం1నుంచి 4గంటలవరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈలు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.



కాగజ్‌నగర్‌లో పెరుగుతున్న ఆర్థిక నేరాలు

- మోసపోతున్న ప్రజలు
- కోట్లలో సేకరించి ఉడాయిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్, ఆగస్టు 9:కాగజ్‌నగర్ పట్టణం ఇప్పుడు ఆర్థిక నేరాలకు అడ్డగా మారింది. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే రెండేళ్లలో డబ్బులు డబుల్ అవుతాయని ఆశ చూపడంతో బడానాయకులు, వ్యాపారులు కోట్లలో పెట్టుబడులు పెడుతున్నారు. చివరి నిమిషంలో మోసపోయామని గుర్తించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మిత్తి డబ్బులు అధికంగా ఇస్తామని అప్పులు తీసుకుని లక్షల్లో సేకరించి కొందరు బిచానా ఎత్తేస్తున్నారు. ఇలా ఒక అతను 12కోట్ల మేర అప్పులు సేకరించి ఆ డబ్బుతో ఉడాయించాడు. అలాగే కాలనీల్లో గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్న చిట్టీల దందాతో కూడా మోసపోయిన పలువురు లబోదిబోమంటున్నారు.

రెట్టింపు డబ్బులు వస్తాయని..

కాగజ్‌నగర్ పట్టణంలో వ్యాపారులు తక్కువ కాలంలోనే రెట్టింపు డబ్బులు వస్తాయన్న ఆశతో షేక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టిన అనంతరం సంబంధిత నిర్వాహకులు బోర్డు తిప్పేస్తున్నా రు. కొంతమంది వ్యాపారులు తమకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. మరికొందరు బడా వ్యాపారులు కావటంతో చెప్పుకుంటే తమ పరువు పోతుందని గుట్టుచప్పుడు కాకుండా రికవరీ ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు నెలల క్రితం కాగజ్‌నగర్‌లో ఓ చిట్టీ వ్యాపారి చాలా మంది వద్ద అప్పులు తీసుకున్నాడు. తీసుకున్న అప్పులకు నెలనెలా మిత్తి ఇస్తూ నమ్మించాడు. కోట్లలో డబ్బు సేకరించి అనంతరం సదరు వ్యక్తి పరారయ్యాడు. మిత్తి వస్తోందన్న ఆశతో ఇచ్చామని, ఇప్పుడు అసలుకే ఎసరు వచ్చిందని అప్పులు ఇచ్చిన వారు వాపోతున్నారు. ఓ సీఎస్‌పీ (కస్టమర్ సర్వీస్ పాయింట్) నిర్వాహకుడు బడా వ్యాపారులను టార్గె ట్ చేసుకొని అప్పులు చేశాడు. చివరకి అప్పు చెల్లించలేనని చేతులెత్తాశాడు. ఇదే విధంగా పలువురు చిట్టీ నిర్వాహకులు కోర్టు నుంచి ఐపీలు తెచ్చుకోవటంతో అందులోని సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గతంలో కూడా ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఐపీ పెట్టాడు. ఏడాదిలోనే పట్టణంలో ఐదుగురి చేతిలో ప్రజలు మోసానికి గురవ్వడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

అత్యాశతో అనర్థం..

తక్కువ కాలంలోనే ఎక్కువ డబ్బు వస్తుందన్న ఆశ సామాన్య ప్రజల కొంప ముంచి అసలుకే మోసం తెస్తోంది. బడా వ్యక్తులు, సమాజంలో పెద్ద హోదాలో ఉన్నవారు పెట్టుబడులు పోతేపోని అన్నట్టు వ్యవహరిస్తున్నారు. అయితే ఇంతజరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మోసపోయిన వారు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకొని బాధపడుతున్నారు.

కేసులు నమోదు చేశాం..

శంకరయ్య, పట్టణ సీఐ

ఆర్థిక మోసాలపై వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేస్తున్నాం. ప్రజలు అత్యాశకుపోయి వడ్డీలకు డబ్బు ఇవ్వకూడదు. అదేవిధంగా ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలు చూసి పెట్టుబడులు పెట్టకూడదు. పూర్తి స్థాయిలో విచారించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా ఆన్‌లైన్ ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలి. లైసెన్సు ఉన్న వారి వద్దనే చిట్టీ వేయాలి. ప్రస్తుతం చిట్టీ వ్యాపారులపై కూడా నిఘాపెట్టాం.

కృషి, పట్టుదల ఉంటే విజయం సాధ్యం: ఎస్పీ


నిఖితను సన్మానిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, ఆగస్టు 9: కృషి, పట్టుదల, అంకితభావం ఉంటేనే విజయాలు సాధ్యమవుతాయని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆరు ఉద్యోగాలు సాధించిన హెడ్‌కానిస్టేబుల్ సర్దార్‌సింగ్ కూతురు నిఖితను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిఖిత గురుకుల విద్యాలయాలకు సంబంధించిన టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, డిగ్రీలెక్చరర్, టీజీపీఎస్సీ నిర్వహించిన జూనియర్ కాలేజీ లెక్చరర్, గ్రూపు-4 పరీక్షల్లో ఉద్యోగం సంపాదించారన్నారు. ఒకే సంవత్సరంలో ఆరు ఉద్యోగాలు సాధించడం అనేది చాలాగొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీప్రభాకర్‌రావు,ఆర్‌ఐపెద్దయ్య, సర్దార్‌సింగ్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సిబ్బంది నిరసన

కాగజ్‌నగర్, ఆగస్టు 9: మిషన్ భగీరథలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, పంప్ ఆపరేటర్లు, వాల్వ్ ఆపరేటర్లు, సిబ్బంది శుక్రవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ఆరునెలలనుంచి జీతాలు ఇవ్వటం లేదన్నారు. దీంతో కుటుంబపోషణభారంగా మారిందన్నారు. అధికారులుస్పందించి జీతాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో నిరవధిక సమ్మెబాట పడుతామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

పెంచికలపేట, ఆగస్టు 9: మండలంలోని ఎల్లూరు గ్రామా నికి చెందిన డోకే బాపుసోద రుడు నరేష్ ఇటీవలమృతి చెందడంతో బాధితకుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. నరేష్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కెరమెరి, ఆగస్టు 9: మండలంలోని దనోర గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. కెరమెరి నుంచి ఆసిఫాబాద్ వైపువెళ్తున్న జీప్,ఆసిఫాబాద్ నుంచి కెరమెరి వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనం పైనున్న గుర్తుతెలియని వ్యక్తినికి తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే అతన్ని దనోర గ్రామస్తులు అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా గాయపడ్డ వ్యక్తి మహారాష్ట్ర వాసిగా స్థానికులు పేర్కొంటున్నారు.

'వేతన బకాయిలు చెల్లించాలి'

సిర్పూర్(యు), ఆగస్టు 9: వేతన బకాయిలు చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మికులు గ్రామపంచాయతీ కార్మికులు గురువారం మండల కేంద్రంలో సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా కార్మికులసంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు చిట్యాల సంజీవ్, గోడాం ధర్మారావు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, పెండింగులో ఉన్న దీర్ఘకాలిక వేతనాలను సత్వరమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జనరల్‌సెక్రెటరీ తోడ్సం గంగారాం, కార్మికులు విశ్వనాథ్, రాజు, విజయ్ శ్రీను, నాగోరావ్, మారుతి, విఠల్, బానిక్‌రావ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ ఎఫ్‌ఆర్వోగా దేవదాసు

కాగజ్‌నగర్, ఆగస్టు 9: కాగజ్‌నగర్ ఎఫ్‌ఆర్వోగా దేవదాసు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎఫ్‌ఆర్వో రమాదేవిని ఫ్లయింగ్‌స్కాడ్ శాఖకు బదిలీ చేశారు. హైదరాబాద్ విజిలెన్స్ శాఖలో చేసిన దేవదాసును ఇక్కడికి బదిలీ చేశారు.

గిరిజనుల అభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దాం: కలెక్టర్


నృత్యాలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే


మాట్లాడుతున్న కలెక్టర్

ఆసిఫాబాద్, ఆగస్టు 9: జిల్లాలోని గిరిజనుల అభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆదివాసీభవన్‌లో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి అధికారి కుష్బూ గుప్తా, ఎస్పీ, శ్రీనివాస్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబుతో కలిసి హాజరై జెండాలవద్ద పూజల నిర్వహించారు. కుమరం భీం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం అందరం సమిష్టిగా కృషి చేద్దామన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆదివాసీలు తమ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాలన్నారు. ఆదివాసీలు ప్రకృతిలో మమేకమై పర్యావరణాన్ని రక్షించుకోవాలని, ప్రతి ఆదివాసీ కుటుంబం తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పాఠశాలల అభివృద్ధి, రహదారుల నిర్మాణంపై ప్రత్యేకదృష్టి సారిస్తామని తెలిపారు. ఆదివాసీ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఉన్నతమైన భవిష్యత్‌ను నిర్మించుకోవాలని తెలిపారు. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థునులు చేసిన గిరిజనసంప్రదాయ నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆదివాసీ నాయకులు వివిధ సమస్యల పరిష్కారంపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, డీఎస్పీ సదయ్య, గిరిజన సంక్షేమ శాఖాధికారులు, గిరిజన సంఘాల నాయకులు పోచయ్య, మోతీరాం, అర్జు, కిష్టయ్య, దశరథ్, సధాకర్, భీంరావు, గుణవంతరావు, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే. నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా నాగుల పంచమి


ఆసిఫాబాద్: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్/కాగజ్‌నగర్, ఆగస్టు 9: ఆసిఫాబాద్ మండలంలో శుక్రవారం మహిళలు నాగులపంచమిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాలనీల్లో పుట్టలవద్ద పూజలు నిర్వహించి పాలు పోశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు కేస్లాపూర్ ఆంజనేయ ఆలయ ఆవరణలో ఉన్న నాగదేవత వద్ద పుట్టలో పాలుపోసి ప్రత్యేకపూజలు చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పలుకాలనీల్లో ఉదయం నుంచి భక్తుల తాకిడి పెరిగింది. ఆలయాల్లో ఉన్న పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

బెజ్జూరు/పెంచికలపేట/సిర్పూర్(టి)/ చింతలమానేపల్లి/ దహెగాం/ రెబ్బెన/జైనూర్ /సిర్పూర్(యు): మండలాల్లో శుక్రవారం నాగుల పంచమిని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో నాగదేవతల వద్ద పూజలు నిర్వహించి పుట్టలో పాలు పోశారు. పాడి పంటలు బాగాపండాలని, తమనుచల్లగా చూడాలని నాగదేవతకు పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోశారు.


బెజ్జూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కాగజ్‌నగర్‌లో ఓల్డు కాలనీలో..

మొక్కలతోనే మానవాళికి మనుగడ

బెజ్జూరు/పెంచికలపేట/సిర్పూర్(టి)/వాంకిడి/కెరమెరి, ఆగస్టు9: మొక్కలతోనే మానవాళికి మనుగడ ఉంటుందని అధికారులు అన్నారు. స్వచ్ఛద నం-పచ్చదనంలో భాగంగా శుక్రవారం మండలకేంద్రాల్లో వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను నాటి సంరక్షిస్తేనే పర్యావరణ సమతుల్యత ఏర్పడి సకాలంలో వర్షాలుకురిసి సమృద్ధిగా పంటలు పండుతాయన్నారు. సిర్పూర్(టి) మండలకేంద్రంలోని సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం ఎంపీడీవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలునాటారు. బెజ్జూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో గౌరీశంకర్, ప్రత్యేకాధికారి వెంకటేష్, డిప్యూటీరేంజ్ అధికారి శ్రావణ్, ఏపీవో రజినీకాంత్, మాజీసర్పంచ్ అన్సార్‌హుస్సేన్, ఎఫ్ఏరవి, పెంచికలపేటలో, ఎంపీడీవో ఆల్బర్ట్, ఎస్సై కొమురయ్య డిప్యూటీరేంజ్ అధికారి జమీన్ అహ్మద్, ఎస్‌వోకవిత, అటవీశాఖ సిబ్బంది, వాంకిడిలో ప్రభుత్వకళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య కార్యదర్శి శివకుమార్, ఏఎన్ఎం రుక్మిణి, బిల్ కలెక్టర్ గోవింద్, అధ్యాపకులు, సోనాపూర్ గ్రామంలో హెచ్ఈవో రవిదాస్ ఏఎన్ఎం సునంద, కారోబారి గోపాల్‌రావు, ఆశా, అంగన్‌వాడీవర్కర్లు, కెరమెరిలో ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్త ప్రసాద్‌రావు, కార్యదర్శులు సతీష్, అంబారావు, బొజ్జిరావు తదితరులు పాల్గొన్నారు.


సిర్పూర్(టి)లో మొక్కలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



'వాస్తవ లాభాలపై వాటా చెల్లించాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 9: సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలపై కార్మికులకు 40శాతం వాటాచెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధానకార్యదర్శి యతిపతి సారంగపాణి కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం సింగరేణి డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్‌కు సంస్థ ప్రధాన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు.

'నూతన బొగ్గు గనులు కేటాయించాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 9: సింగరేణికి నూతన బొగ్గు గనులు కేటాయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్కే న్యూటెక్ గనిపై గేట్‌మీటింగ్ నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేలం ద్వారా ప్రైవేటు కంపెనీలకు బొగ్గు గనులు కేటాయించడం వల్ల ప్రభుత్వ సంస్థలు మూతపడతాయని ఆవేదన వ్యక్తంచేశారు.

మొక్కల పెంపకానికి సింగరేణి పెద్దపీట

మందమర్రిటౌన్, ఆగస్టు 9: మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించేందుకు యాజమాన్యం పెద్దపీట వేస్తుందని కేకే ఓసీపీ ప్రాజెక్టు ఇంజనీర్ సూర్యనారాయణరాజు తెలిపారు. శుక్రవారం ఏక్‌పేడ్ మాకేనామ్ తల్లులకు అంకితం చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలునాటి సంరక్షించాలని సూచించారు.

'భవిష్యత్ కోసం మొక్కలు నాటండి'

శ్రీరాంపూర్, ఆగస్టు 9: భవిష్యత్ కోసం ఇప్పుడే మొక్కలు నాటాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టిశ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "ఏక్‌పేడ్ మాకే నామ్" పేరిట ప్రధానిమోదీ పిలుపు మేరకు శ్రీరాంపూర్ ఏరి యాలో మొక్కలు నాటారు. ఏరియా స్టోర్స్, టింబర్ యార్డులో మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైనగాలి,నీరు అందించడానికి ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి, దానిని పరిరక్షించాలన్నారు.

సీపీఆర్ఎంఎస్‌లో అపరిమిత ఖర్చుకు ఆమోదం

శ్రీరాంపూర్, ఆగస్టు 9: సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డు ద్వారా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల వైద్యం కోసం అపరిమిత ఖర్చుకు ఆమోదం తెలుపుతూ సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మెడికల్ కార్డు ద్వారా వైద్యం పొందేందుకు కేవలం 8లక్షల రూపాయల వరకు పరిమితి ఉండేదని, ఇప్పుడు దానిని ఎత్తివేసినట్లు చెప్పారు.

జీఎం సేవలు అభినందనీయం

మందమర్రిటౌన్, ఆగస్టు 9: మందమర్రి ఏరియా జీఎం మనోహర్ ఏరియా అభివృద్ధికి చేసిన సేవలు అభినందనీయమని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. కొత్తగూడెం కార్పొరేట్‌కు ఎన్విరాన్‌మెంట్ జీఎంగా బదిలీ అయిన సందర్భంగా శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఏరియా బొగ్గు ఉత్పత్తిలో ముందజలో ఉండేలా జీఎం కృషిచేశారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేసిన అధికారులను కార్మికులు మర్చిపోరని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, పీఎం శ్యాంసుందర్, నాయకులు చిప్ప నర్సయ్య, ఇప్పకాయల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గని మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 9: శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ3 గనిమేనేజర్‌గా పనిచేసి పదోన్నతిపై ఆర్జీ-2ఏరియా రక్షణాధికారిగా వెళ్తున్న ఎస్ సంతోష్ కుమార్‌ను ఐఎన్‌టీయూసీయూనియన్, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం(140/2018) ఆధ్వర్యంలో గనిఆవరణలో శుక్రవారం సన్మానించారు. ఆయన మేనేజర్‌గా గనికి ఎంతో సేవచేశారని, కార్మికుల సంక్షేమానికి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడ్డారని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ఐఎన్‌టీయూసీ ఏరియాఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్రక మిటీ నాయకులు గరిగెస్వామి, ల్యాగల శ్రీనివాస్, ఏరియా నాయకులు గణపతి, మహేష్, మహేందర్‌రెడ్డి, మనోజ్,వీరమల్లు, శ్రీరాంపూర్ ఏరియా లైజన్ అధికారి కెకిరణ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ యూనియన్ బ్రాంచ్‌కార్యదర్శి రెడ్డపాక లక్ష్మణ్, పిట్ కార్యదర్శులు కమల్‌కుమార్, సుందిళ్లనరేష్, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: ఎస్టీపీపీ డీజీఎం(పర్సనల్) అధికారిగా అజ్మీర తుకారాం శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తుకారాంను పర్సనల్ డిపార్టుమెంట్ సిబ్బంది ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ఠాకూర్ మోహన్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అధికారులు చుక్కల శ్రీనివాస్, నరేష్, అంజద్, శశిధర్, అరుణ, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌వోటు జీఎం

శ్రీరాంపూర్, ఆగస్టు 9: శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటు జీఎంగా ఎన్ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను అధికారులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) పి అరవిందరావు, ఏరియారక్షణఅధికారి శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళ ప్రసవ వేదన

ఆసిఫాబాద్, ఆగస్టు 9: ఏజెన్సీ ప్రాంతంలోని గర్భిణీ ప్రసవవేదనకు గురైన సంఘటన శుక్రవారం ఆసిఫాబాద్ మండలం వెంకటపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని టోకిగూడలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలి పిన వివరాల ప్రకారం.. టోకిగూడ గ్రామానికి చెందిన ఆత్రం ధర్మబాయి ఏడు నెలల గర్భవతి. శుక్రవారం మధ్యాహ్నం ఆమెకు పురిటినొప్పులు రావ డంతో కుటుంబసభ్యులు ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధమై అంబు లెన్స్‌కు సమాచారం అందించారు. కానీ మార్గమధ్యంలో బండగూడ వాగు ఉధృ తంగా ప్రవహిస్తుండటంతో అక్కడికి చేరుకున్న అంబులెన్స్ వాగు దాటేపరిస్థితి లేకపోవడంతో అక్కడే ఆగిపోయింది. దీంతో ధర్మబాయిని గ్రామం నుంచి కిలో మీటరు మేర నడిపించి అతికష్టంమీద వాగుదాటించారు. దీంతో పురిటినొప్పులు అధికమై అంబులెన్స్ వద్దే శిశువుకు జన్మనిచ్చింది. ధర్మబాయి గర్భంలో మరో శిశువు ఉండటంతో నొప్పులు తగ్గలేదు. దీంతో అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ సీహెచ్‌సీకి తరలిస్తున్న క్రమంలో అప్పటికే పుట్టినశిశువు మార్గమధ్యలో మృతి చెందింది. పురిటినొప్పులతో సీహెచ్‌సీకి చేరుకోగా వైద్యులు నామమాత్రంగా పరిక్షించి పరిస్థితి విషమంగా ఉందంటూ వెంటనే మంచిర్యాలకు తరలించాలని కుటుంబీకులకు సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు ధర్మబాయిని 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ధర్మబాయి మరో శిశువుకు జన్మనిచ్చింది. కాగా ఆసిఫాబాద్ సీహెచ్‌సీ వైద్యులు రోగులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని కుటుంబసభ్యులు ఆరోపించారు. గ్రామానికి రోడ్డు, వాగుపై వంతెన లేకపోవడంతోనే అత్యవసర సమయాల్లో తీవ్రఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని గర్భిణులు ప్రసవవేదనకు గురవుతున్నారని గ్రామ స్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



కెరమెరి జోడేఘాట్‌లో భీం విగ్రహానికి పూల మాల వేస్తున్న ఆదివాసీ నాయకులు. సిర్పూర్(టి)లో..

సిర్పూర్(టి)/బెజ్జూరు/ పెంచికలపేట/వాంకిడి/ కౌటాల/ దహెగాం/రెబ్బెన/కెరమెరి/తిర్యాణి/ జైనూరు/ సిర్పూర్(యు), ఆగస్టు 9: మండలకేంద్రాల్లో శుక్రవారం ప్రపంచ ఆదివాసీదినోత్సవాన్ని ఆదివాసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ జెండాలను ఎగురవేశారు. కుమరంభీం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ర్యాలీలు నిర్వహించారు. ఆదివాసీ మహిళల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. రెబ్బెన ఎంపీపీఎస్ మన్నెగూడ పాఠశాలలోవిద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. సిర్పూర్(టి)లో జరిగినకార్యక్రమంలో చీలపల్లి, లింబుగూడ, మేడిపల్లి, చిన్నమాలిని, పెద్దమాలిని, లక్ష్మీపూర్, హీరాపూర్, చింతకుంట, దోర్పల్లి, లోన వెల్లి, వెంపల్లి, చుంచుపల్లి గ్రామాల ఆదివాసీనాయకులు పాల్గొ న్నారు. బెజ్జూరులో నాయకులు పుష్పలత, శ్రీదేవి, ఓంప్రకాష్, సకారాం, తిరుపతి, శంకర్, రమేష్, శేఖర్, అమృత, సరోజన, బిక్షమయ్య, వెంకటేశ్వర్, -పెంచికలపేటలో ఎస్సై కొమురయ్య, అశోక్, సకారాం, గురుదాస్, ప్రభాకర్, మదుకర్, -వాంకిడిలో ఆదివాసీ నాయకులు వెంకట్రావు, అన్నిగా, దేవరావు, సాగర్, భీంరావు, తుకారాం, గంగారాం, -కౌటాలలోజడ్పీమాజీచైర్మన్ సిడాం గణపతి, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య, మన్నెవార్ సేవాసంఘం జిల్లాఅధ్యక్షుడు బాబు, -దహెగాంలో శ్రీనివాస్, మల్లేష్, అంజయ్య, రవీందర్, సంజీవ్, మల్లేష్, తిరుపతి, నీలేష్, భీమయ్య, చంద్రయ్య, వెంకటేష్, -రెబ్బెనలో ప్రధానోపాధ్యాయుడు మహేష్ విద్యార్థులతల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, -జైనూరులో గోండిధర్మకోయ పున్నం, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్రంఆనంద్‌రావ్, కనక యాదవ్‌రావు, కోట్నాక భీంరావ్, మండలసహకారచైర్మన్ కొడప హన్నుపటేల్, సిర్పూర్(యు)లో మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, మాజీఎంపీపీ ఆత్రం దౌలత్ రావు, మాజీసర్పంచులు ఆర్కునాగోరావు, ఆత్రం ఓం ప్రకాష్, పెందోర్ నాగోరావు, కెరమెరిలో రాజేష్, చందన్‌షా, సోనేరావు, అంబారావు, తిర్యాణి దౌలత్‌రావు,కృష్ణారావు, శంకర్, భీమయ్య, లింగు, గోపాల్, బాపు, సోను, దస్వంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.